ఆర్టీసీ బస్సు ఎరుగని పల్లెలు

రహదారులు మెరుగుపడ్డాయి.. దశాబ్దాలుగా కలగా మిగిలిన ఆర్టీసీ డిపో సౌకర్యం వాస్తవ రూపం దాల్చింది. ఈ పరిణామంతో ముఖ్యంగా ఏజెన్సీ పల్లె వాసులు ఆనందప డ్డారు. కానీ రోజులు గడుస్తున్నా బస్సు జాడ లేకపోవడంతో వారి ఆనందం ఆవిరైపోయింది. దీంతో ఎప్పటిలాగే ప్రైవేటు వాహనాలే వారికి దిక్కవుతున్నాయి. ప్రధానంగా విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక ప్రయాణికుల వెతలు షరా మామూలే.

- రోడ్ల నిర్మాణం జరిగింది.. బస్సు డిపో ఏర్పాటైంది
- కానీ నేటికీ అందని ద్రాక్షగానే బస్సు సౌకర్యం
- పల్లెల్లో ప్రజలకు తప్పని రవాణా కష్టాలు


కొమరారం - మాణిక్యారం మధ్య డబుల్ రోడ్డు

ఇల్లెందురూరల్: ఇల్లెందు కేంద్రంగా ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా ప్రజలు నినదిస్తూ వచ్చారు. ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అభ్యర్థన మేరకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నాలుగేళ్ల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో ప్రజలకు వాగ్దానం చేశారు. ఈ మేరకు మూడు నెలల క్రితం బస్‌డిపోను స్వయంగా మంత్రి పువ్వాడ ప్రారంభించారు. దశాబ్దాలుగా ఇల్లెందు ప్రాంత ప్రజలు ఎదురు చూసిన ఆర్టీసీ డిపో సౌకర్యం నేటినుంచి అందుబాటులోకి వస్తుందని ప్రకటించారు. కానీ బస్సులపై పేరు మారిందే తప్ప, సర్వీసులలో మాత్రం ఎటువంటి మార్పు లేదు. గతంలో కొత్తగూడెం, ఖమ్మం డిపోల నుంచి అందుబాటులో ఉన్న బస్సు సర్వీసుల మాదిరిగానే నూతన డిపో ద్వారా కూడా అవే సర్వీసులు కొనసాగుతున్నాయి. అంతే తప్ప సేవల్లో ఎటువంటి మార్పు కనిపించడం లేదు.

గతంలో పడుతూ లేస్తూ..

మండలంలో రహదారి సౌకర్యం అంతంత మాత్రంగా ఉన్న రోజుల్లోనే ఏజెన్సీలోని మారుమూల పల్లెలకు బస్సు సౌకర్యం అందుబాటులో ఉండేది. పదేళ్ల క్రితం ఇల్లెందు నుంచి కొమ్ముగూడెం, మస్సివాగు, మాణిక్యారం, తుంటుబాలుతండా, బోయితండా మీదుగా సర్వేతండా వరకు కొత్తగూడెం డిపోకు చెందిన బస్సు నడిచేది. రోజుకు మూడు సర్వీసులు నడిచిన బస్సు ద్వారా ఆర్టీసీ కూడా మంచి లాభాలను ఆర్జించింది. ఈ క్రమంలో భారీ వర్షాలతో రహదారులు మరీ అధ్వానంగా మారడంతో బస్సు సేవలను ఆర్టీసీ నిలిపివేసింది. ఆ తరువాత నాలుగేళ్ల క్రితం మరోసారి కొత్తగూడెం డిపో ద్వారా ఇల్లెందు నుంచి రొంపేడు, కొమరారం, మాణిక్యారం వరకు రోజుకు బస్సు సౌకర్యం కల్పించారు. కానీ ఇక్కడ ఆర్టీసీ అధికారుల అవగాహన లోపం కారణంగా సేవలు కొద్ది రోజులకే నిలిచిపోయాయి. గతం మాదిరిగా కాకుండా అత్యధిక దూరం ఇల్లెందు-గుండాల బస్సు సర్వీసులు నడిచే మార్గంలోనే నడిచే విధంగా మాణిక్యారం బస్సు సర్వీసు ఉండటంతో నష్టం వస్తోందనే సాకుతో సేవలు నిలిపివేశారు.

నేడు అన్ని సౌకర్యాలు అందుబాటులో..

ప్రస్తుతం మండలంలో ఒకటి రెండు రహదారులు మినహా అన్ని రహదారులు పూర్తిగా మెరుగుపడ్డాయి. పూబెల్లి నుంచి దండగుండాల వరకు, తుంటుంబాలు తండా నుంచి పోచారం తండా వరకు రహదారుల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే మూడు నెలల క్రితం ఇల్లెందులో ఆర్టీసీ శాటిలైట్ బస్సు డిపో ప్రారంభం కావడం ఏజెన్సీ ప్రజల రవాణా కష్టాలు తీరినట్లేనని అందరూ భావించారు. కానీ ఆర్టీసీ డిపో ద్వారా నూతన మార్గాలలో బస్సు సేవలు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఇల్లెందు నుంచి కొమ్ముగూడెం, మస్సివాగు, మాణిక్యారం, తుంటుబాలుతండా వరకు.. ఇల్లెందు నుంచి సుదిమళ్ల, పూబెల్లి, మొండితోగు నుంచి తిరిగి ఇల్లెందు వరకు, ఇల్లెందు నుంచి రొంపేడు, మిట్టపల్లి, మామిడిగుండాల, లచ్చగూడెం మీదుగా తిరిగి ఇల్లెందు వరకు, ఇల్లెందు నుంచి రాఘబోయినగూడెం, కారేపల్లి మండలంలోని పలు గ్రామాలకు రహదారి సౌకర్యం మెరుగ్గా ఉంది. ఆయా మార్గాలలో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. అయినా బస్సు సౌకర్యం ఏర్పాటు కోసం ఆర్టీసీ నుంచి ఎటువంటి ముందడుగు కనిపించడం లేదు.

అవస్థలు పడుతున్న ప్రజలు..

ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఏజెన్సీ గ్రామాలలో ప్రజలు అధిక మొత్తం ఆటోలకు చార్జీలు చెల్లించి ప్రయాణించాల్సి వస్తోంది. ఇక విద్యార్థులు స్థానికంగా అయితే సైకిళ్లపై, దూరం అయితే స్కూల్ బస్సులపై వారు అడిగినంత అద్దె చెల్లించి ప్రతీరోజు పాఠశాలకు చేరుకోక తప్పడం లేదు. ఇక రైతులు ఎరువులు, పురుగుమందులు, ఇతరత్రా వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసి తిరిగి ఇంటికి చేర్చుకునేందుకు నానా కష్టాలు పడుతున్నారు. ఇంతేకాకుండా చాలామంది ఆర్థిక స్థోమత లేకున్నా తప్పనిసరి పరిస్థితిలో బైక్‌లను కొనుగోలు చేస్తున్నారు. ఇలా ఏజెన్సీ పల్లెల్లో ప్రతీఒక్కరు తాము సంపాదించిన దాంట్లో రవాణా ఖర్చులకే నాలుగో వంతు ఖర్చు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

ఇబ్బందులు పడుతున్నాం...



నాకు గ్రామంలో చిన్న కిరాణా దుకాణం ఉంది. సామగ్రి తీసుకొచ్చేందుకు బస్సు సౌకర్యం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. గతంలో గ్రామానికి బస్సు సౌకర్యం ఉండేది. ఇప్పుడది నిలిచిపోయింది. డిపో ఏర్పాటుతో మళ్లీ ప్రారంభిస్తారని ఆశించా. కానీ బస్సు మా ఊరు వస్తుందనే ఆశ లేదు.

– నాళ్ల శ్యాంసుందర్, చిరు వ్యాపారి, మాణిక్యారం

సైకిల్‌పై స్కూల్‌కు వెళ్తున్నా..



మాది మాణిక్యారం గ్రామం. కొమరారం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. నిత్యం సైకిల్‌పై పాఠశాలకు వెళుతున్నా. వర్షం వచ్చినప్పుడు ఇబ్బందిగా ఉంది. రోజూ అలిసిపోతున్నా. మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తే బావుంటుంది. మరింత మంది ప్రభుత్వ పాఠశాలకు వస్తారు.

– బానోత్ దేవీలాల్, విద్యార్థి, మాణిక్యారం

బస్సు సౌకర్యం కల్పించాలి



గతంలో అనేక ఆందోళనల ఫలితంగా ఏజెన్సీ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించారు. రహదారులు అధ్వానంగా ఉండటంతో బస్సు సర్వీసులు నిలిపివేశారు. నేడు రహదారులు మెరుగుపడ్డాయి. ఆర్టీసీ డిపో కూడా ప్రారంభమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏజెన్సీ పల్లెలకు బస్సు సౌకర్యం ప్రారంభించాలి.

– మోకాళ్ల కృష్ణ, సర్పంచ్, మాణిక్యారం

క్లుప్తంగా

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధం..



మాట్లాడుతున్న సారయ్య

ఇల్లెందు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సీపీఐ సిద్ధంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య తెలిపారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, పట్టణ కమిటీ నేతలు కలిసి కట్టుగా పార్టీ గెలుపు కోసం బూత్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని కేడర్‌ను సిద్ధం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించిన తీరును ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి సీపీఐ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కమ్యూనిస్టులను విస్మరించిన కేసీఆర్ కారుకు బ్రేకులు వేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ, మండల నాయకులు శంకర్, నాగయ్య, ఐలయ్య, నజీర్, రవీందర్, రాజారామ్, చంద్రకళ, కొమురయ్య, హరీష్‌గౌడ్, సరిత, లక్ష్మి, కనకతార పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్‌కు పలువురి పరామర్శ

సింగరేణి(కొత్తగూడెం)/కొత్తగూడెంరూరల్: సింగరేణి డైరెక్టర్ ఎన్.బలరామ్ తండ్రి హన్మంతునాయక్ ఇటీవల మృతి చెందగా మహబూబ్‌నగర్ జిల్లాలోని స్వగ్రామంలో బుధవారం దశదిన కర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు, మాజీ జీఎం అందెల ఆనందరావు, ఆచార్య మద్దెల శివకుమార్ తదితరులు పాల్గొని హన్మంతునాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇంకా రాజేశ్వరరావు, కనుగుల తిరుపతి, శ్రీనివాస్, బందెల విజేందర్, తిరుపతి, దేగల ప్రవీణ్‌కుమార్, నక్క సుమన్, అందె వెంకటేశ్, కరీముల్లా, సకినాల తిరుపతి, మందా హన్మంతు, అంతోటి పాల్, సకినాల సమ్మయ్య, బందెల విజేందర్, అల్లి ప్రకాశ్‌రావు, వంగపండ్ల సుమన్‌యాదవ్, సామంతుల శంకర్, అంకూస్, ప్రభాకర్ తదితరులు కూడా నివాళులర్పించారు.

చెత్త తొలగింపు


వెంకట్యాతండా స్టేజీలో బస్ షెల్టర్ వద్ద శుభ్రం చేయించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: బేతంపూడి పంచాయతీ వెంకట్యాతండా స్టేజీలో రూ.2 లక్షల వ్యయంతో సుమారు ఏడేళ్ల క్రితం నిర్మించిన బస్ షెల్టర్ నిరుపయోగంగా మారింది. దీంతో చెత్తచెదారం, ముళ్ల కంపలతో నిండి ఉంది. అదే విధంగా తొమ్మిదోమైలు తండాలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. డంపింగ్ యార్డుకు తరలించాల్సిన చెత్తను రోడ్డు పక్కనే కుప్పలుగా పోస్తున్నారు. ఈ సమస్యలపై గురువారం సాక్షిలో ప్రత్యేక వార్తా కథనాలు ప్రచురితమయ్యాయి. అధికారులు స్పందించారు. ఎంపీడీఓ కోట వీరబాబు, ఎంపీవో గాంధీల ఆదేశాల మేరకు బేతంపూడి కార్యదర్శి మీనా కుమారి, తొమ్మిదోమైలు తండా కార్యదర్శి కృష్ణకుమారి పంచాయతీ కార్మికులతో పారిశుద్ధ్యం పనులు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ముఌ్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహిస్తాం..


ఎన్నికల ప్రచారం చేస్తున్న కామేశ్

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించి పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేశ్ అన్నారు. గురువారం మన కొత్తగూడెం – మన కామేశ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మార్కెట్ ఏరియాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్ని దుకాణాల వద్దకు వెళ్లి తనను గెలిపించాలని అభ్యర్థించారు. కామేశ్ మాట్లాడుతూ.. కొంతమంది స్వార్థ రాజకీయ నాయకులు మున్సిపాలిటీకి ఎన్నికలు జరగకుండా కోర్టులో కేసు వేసి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. తనను గెలిపిస్తే సమస్యలకు తెరదించి ఎన్నికలు జరిగేలా చూస్తానన్నారు. సర్వే నంబర్ 817, 727, 999, 444లో రిజిస్ట్రేషన్లు పునఃరుద్ధరించి ప్రజల ఇబ్బందులు తొలగిస్తానన్నారు. 20 ఏళ్లుగా ఏ నాయకుడూ ఒక కొత్త పరిశ్రమను తేలేకపోయారన్నారు. యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, పట్టణ, మండల కేంద్రాల్లో నిరుద్యోగ, యువతీ యువకులకు కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉద్యోగాల పొందేలా కృషి చేస్తానన్నారు. ఇర్పా రవికుమార్ దొర, కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, కేసుపాక వెంకటేశ్వర్లు, దామోదర్, బండి రమణి, కేతిని కుమారి, మల్లిక పాల్గొన్నారు.

రెండేళ్లుగా ఆచూకీ దొరకని రాజేష్..

సుజాతనగర్: రెండేళ్ల కిందట తప్పిపోయిన 16 ఏళ్ల బాలుడి ఆచూకీ ఇంకా లభించలేదు. దీంతో బాలుడి తల్లిదండ్రులు రోదిస్తున్నారు. బాలుడు క్షేమంగా ఉన్నాడా? ఎక్కడైనా చిక్కుకున్నాడా? అని తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. సీతంపేట బంజర గ్రామానికి చెందిన బానోత్ ప్రతాప్, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. వీరిలో చిన్నకుమారుడు రాజేశ్ 10వ తరగతి చదువుతున్నప్పుడు తనకు సెల్‌ఫోన్ కావాలంటూ తండ్రిని అడిగాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగా కొనివ్వలేక రాజేష్‌ను మందలించాడు. మనస్థాపం చెందిన రాజేష్ ఎవరికీ చెప్పకుండా అదేరోజు సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. నాటి నుంచి బాలుడి జాడ మాత్రం తెలియడం లేదు.

ఆధార్ అప్‌డేట్ కోసం పడిగాపులు


బ్యాంకు తెరవక ముందే బారులు దీరిన జనం

సుజాతనగర్: ప్రస్తుతం అన్నింటికీ ఆధార్ తప్పనిసరి. రేషన్ కార్డు కేవైసీ నిమిత్తం వేలిముద్రలు పడనివారు ఆధార్ అప్‌డేట్ కోసం తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. సుజాతనగర్ ఏపీజీవీబీ బ్యాంకులో ఆధార్ సెంటర్ ఉంది. మండలం మొత్తంలో ఒకే ఆధార్ సెంటర్ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ అప్‌డేట్ కోసం బ్యాంకు తెరవక ముందే ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఇక్కడ క్యూ కడుతున్నారు. రోజులో కేవలం 40 మంది వివరాలు మాత్రమే అప్‌డేట్ చేస్తుండటంతో మిగిలిన వారు వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి. సర్వర్ బిజీ అని, నెట్ పనిచేయడం లేదని తిప్పి పంపుతున్నారు. మండల కేంద్రంలో మరో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా


ముర్రేడు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

పాల్వంచ: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. లారీల్లో, ట్రాక్టర్లలో ఇసుక తరలింపు భారీ ఎత్తున సాగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మణుగూరు, బూర్గంపాడుల నుంచి లారీల్లో ఇసుకను ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా రవాణా సాగిస్తూ జీరో దందాకు తెరలేపారు. ఈ ఇసుక లారీలు పాల్వంచ మీదుగా కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ వరకు తరలిస్తున్నారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని ముర్రేడు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా సైతం నిత్యకృత్యంగా మారింది. ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. పాత పాల్వంచ, గుడిపాడు, కుంటినాగులగూడెం నుంచి పగలు, రాత్రీ తేడా లేకుండా ఇసుక ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు, తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇసుకను తరలించే సమయాల్లో ట్రాక్టర్ డ్రైవర్లు అతివేగంతో నడుపుతుండటంతో ఎప్పుడు ఎటువైపు నుంచి ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రెంచ్‌ను పూడ్చేసిన అక్రమార్కులు..

ముర్రేడు నుంచి ఇసుక ట్రాక్టర్లు తిరగకుండా పోలీస్, అటవీ శాఖ సిబ్బంది కలిసి ట్రెంచ్ (గొయ్యి) తీయించి ట్రాక్టర్లు తిరిగే వీలు లేకుండా చేశారు. కానీ ఇసుక అక్రమార్కులు మాత్రం వెంటనే వాటిని పూడ్చేసి తిరిగి యథేచ్ఛగా ట్రాక్టర్లను తిప్పుతుండటం గమనార్హం. గతంలో పోలీస్ శాఖ సుమారు 80 మంది ట్రాక్టర్ యజమానులను బైండోవర్‌తో పాటు రూ.2లక్షల వ్యక్తిగత పూచికత్తు సైతం తీసుకున్నారు. అయినా తిరిగి ఇసుక దందా కొనసాగిస్తున్నారు. గతంలో రాత్రివేళ, ఇటీవల పట్టపగలే అక్రమార్కులు రెచ్చిపోతున్నా సంబంధిత శాఖల పట్టించుకోకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

లారీల్లో జీరో దందా...

మణుగూరు, బూర్గంపాడుల మీదుగా జీరో దందా యథేచ్ఛగా సాగుతోంది. లారీలకు ఒక అనుమతి పత్రం ఉంటే అదే పత్రంతో రెండు, మూడు రోజుల పాటు లారీలు ఇసుక తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు ఈ లారీలపై ఫిర్యాదులు వస్తున్నా వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. లారీల ద్వారా ఇసుక అడ్డగోలుగా తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని సంబంధిత అధికారులు ఈ అక్రమ వ్యాపారులను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి..


ప్రజలతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే వనమా

పాల్వంచ: ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కొందరు గారడీ మాటలతో మీ ముందుకు వస్తారని, వారిని నమ్మొద్దని, తాను చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసని ఎమ్మెల్యే, కొత్తగూడెం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని పాండురంగాపురం, ఎస్సీ కాలనీ, ఇల్లెందుల పాడు, తవిశెల గూడెం, పాత సూరారం, సూరారంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఘన స్వాగతం పలికారు. వనమా మాట్లాడుతూ.. పాండురంగాపురం బ్రిడ్జిని తాను మంజూరు చేయించానన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలు గుర్తించాలని, వృద్ధులకు పెన్షన్లను రూ.2వేల నుంచి రూ.3వేలకు, వికలాంగుల పెన్షన్లను రూ.4వేల నుంచి రూ.5వేలకు పెంచడం జరుగుతుందన్నారు. అదేవిధంగా రైతు బంధు పథకాన్ని సైతం ప్రతి రైతుకు అందేలా చూస్తామన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అధికారంలో ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు గెలిస్తే అనేక సంక్షేమ పథకాలు రద్దవుతాయన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు కనగాల రాంబాబు, విశ్వనాథం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించండి..


మాట్లాడుతున్న యల్లంకి సత్యనారాయణ

జూలూరుపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు యల్లంకి సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం జూలూరుపాడులోని వైరా ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌లాల్ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మదన్‌లాల్ గెలుపు కోసం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఆసరా పెన్షన్లు, కల్యాణి లక్ష్మి, షాదీ ముబారక్, రైతు బంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, రైతులకు ఉచిత విద్యుత్ తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అంతకముందు పడమటనర్సాపురంలో జరిగిన బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భూక్యా కళావతి, ఎదళ్లపల్లి వీరభద్రం, పోలుదాసు గోపాలకృష్ణమూర్తి, చెరుకుమల్ల రుక్కయ్య, చావా వెంకటరామారావు, మూడ్ చిట్టిబాబు, దుద్దుకూరి నాగేశ్వరరావు, చాపలమడుగు రామ్మూర్తి, సాయిల నాగేశ్వరరావు, కట్రం మోహన్‌రావు, నాగా శ్రీను, బాదావత్ వెంకట్రామ్, కొదుమూరి మల్లికార్జున్, భూక్యా సేవా, నిమ్మటూరి కనకయ్య, మాళోత్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలి


జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలని గురువారం జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్యకు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పనిచేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ 2022–23 సంవత్సరానికి కంపెనీకి వచ్చిన లాభాల్లో వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులందరికీ పర్మనెంట్ కార్మికుల మాదిరిగా దసరా, దీపావళి పండుగలు నేపథ్యంలో లాభాల వాటా చెల్లించినట్లుగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల్లో వాటా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి కంపెనీకి వచ్చే లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ కీలకంగా ఉందని, బొగ్గు ఉత్పత్తిలో ట్రాన్స్‌పోర్ట్‌లో, రక్షణలో సర్వేస్‌లోని వివిధ రకాల పనులలో కీలకంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న దిండిగల రాజేందర్, పక్కన నాయకులు

టేకులపల్లి: నవంబర్ 1న ఇల్లెందులో జరగనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభను జయప్రదం చేయాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ దిండిగల రాజేందర్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు సుదర్శనం రంగనాథ్, టేకులపల్లి మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం టేకులపల్లిలోని బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయంలో మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇల్లెందు నియోజకవర్గంలో కనీవిని ఎరుగని రీతిలో సభ సక్సెస్ కోసం పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయడం సిగ్గుచేటన్నారు. దగా, మోసాలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ఇల్లెందు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియను అధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

కార్మికులు రక్షణ సూత్రాలు పాటించాలి


ఇల్లెందు: రక్షణ సూత్రాలు వివరిస్తున్న జేకే ఓసీ పీఓ వెంకటేశ్వర్లు

ఇల్లెందు: ప్రతీ ఉద్యోగి తన రక్షణ పట్ల బాధ్యతతో మెలగాలని నా బాధ్యత – నా కుటుంబం అనే నినాదంతో ముందుకు సాగాలని జేకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జేకే ఓసీలో వార్షిక భద్రత పక్షోత్సవాలు నిర్వహించారు. పని స్థలంలో ఏకాగ్రతతో ఉండాలని, రక్షణ పనిముట్లు ధరించాలని, రక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ పూర్ణచందర్, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, ఇంజనీర్ చిన్నయ్య, సీనియర్ పర్సనల్ అధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీటీసీలో...

సింగరేణి ఇల్లెందు ఏరియా ఎంవీటీసీలో 54వ వార్షిక రక్షణ పక్షోత్సవాలను కన్వీనర్ సుశాంతసహా భద్రత జెండాను ఎగుర వేసి ప్రారంభించారు. గురువారం ఏర్పాటు చేసిన రక్షణ వారోత్సవాలలో భాగంగా అధికారులు, ఉద్యోగులతో కలిసి రక్షణ ప్రతిజ్ఞ చేశారు. మోడల్ రూమ్, లైబ్రరీ, యోగా, గ్యాస్, అండర్ గ్రౌండ్, తరగతి గదులు, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, కమిటీ సభ్యులు ప్రసాద్, రజా హుస్సేనీ, మహేష్, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.


టేకులపల్లి: బహుమతులు అందజేస్తున్న అధికారులు

టేకులపల్లి: ప్రతీఒక్కరు గనిలో రక్షణ సూత్రాలు విధిగా పాటించాలని రక్షణ పక్షోత్సవాల కన్వీనర్, సింగరేణి (ఎడ్యుకేషన్) జీఎం ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం కేటీసీలో 54వ వార్షిక రక్షణ పక్షోత్సవాలను ఆయన ప్రారంభించారు. రక్షణ జెండాను ఎగురవేసి ఉద్యోగుల చేత రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని, రక్షణపై అందరికీ అవగాహన ఉండాలని, నా భద్రత.. నా కుటుంబ బాధ్యత అనే నినాదంతో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా పని స్థలాలలో తమకు కేటాయించిన పనులను పూర్తి చేసి, ఎటువంటి ప్రమాదాలు లేని సింగరేణిగా తీర్చిదిద్దటంలో అందరూ భాగస్వాములు కావాలని తెలియజేశారు. అనంతరం వార్షిక రక్షణ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు, ట్రేడ్ టెస్ట్ విజేతలకు, ఉత్తమ రక్షణపై అవగాహన కలిగిన డిపార్ట్‌మెంటల్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. తనిఖీలో భాగంగా గనిలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం జాన్ ఆనంద్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద్, ఇతర కమిటీ సభ్యులు, రాజమల్లు, డీవైజీఎం ఎస్‌టీపీపీ బి.శంకర్‌రావు, డీవైజీఎం (ఈఅండ్ఎం) ఓసీ, బాలాజీ నాయుడు, డీవైజీఎం (సర్వే), పోషమల్లు డిప్యూటీ మేనేజర్, పి.శ్రీనివాసు ఏరియా రక్షణాధికారి, ఏరియా ఇంజనీర్ నరసింహా రాజు, ప్రాజెక్టు ఇంజనీర్ శివ శంకర్, వర్క్ మెన్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


ఇల్లెందు: ఎంవీటీసీ తరగతి గదిలో తనిఖీ చేస్తున్న అధికారులు